జైలుగది ఆత్మకథ

ఓల్గా

జైలుగది మరల నిట్టూర్చింది. ఔను! జైలుగది తరచుగా నిట్టూరుస్తూ వుంటుంది. కొత్త మనుషులు వచ్చినపుడు పాతమనుషులు పోయినపుడు– కొత్త అనుభవాలు పాత అనుభవాలను నెట్టేసినపుడు– కొత్తబాధలు పాతబాధలను విముక్తిచేసినపుడు కొత్త అన్యాయాలు పాతవానిని అతిక్రమించినపుడు– జైలుగది నిట్టూరుస్తూనే వుంటుంది. తనను కట్టినపుడే అనుకుంది ఆగదినన్నిలా ఎత్తుగా వెలుతురుకూడా సోకకుండా ఎందుకు కడుతున్నారా అని. అనుకున్నట్లుగా అది జైలుగదే ఐంది అప్పటినుంచీ అది నిట్టూరుస్తూనే వుంది.

"ఎందరో వస్తుంటారు, పోతుంటారు. తనను కట్టినపుడే యింకా తన కొత్త వాసన పోకముందే వచ్చాడొక ముసలితాత. దొంగతనం చేసాడట యజమానియింట్లో. ఎప్పుడూ ఏడుస్తుండేవాడు కాళ్ళుపడిపోయిన ముసలిదాన్ని తలుచుకుని. ఎందుకుచేసాడో దొంగతనం— తెలియదూ తనకోసం ఇట్లాంటి గదులుకట్టి వుంచుతారని, ఇంతభయంకరమైన జీవితం తనకోసం ఎదురుచూస్తుందని తెలిసే ఆపని చేసాడంటే అతని ఆకలి ఎంత భయంకరమైనదో! అతని అవసరాలు ఎంత క్రూరమైనవో! ఎట్లా తప్పించుకుంటాడు ఆకలినుంచి? దానికి మార్గం చూపించకూడదూ నన్నిట్లా ఎత్తుగా కట్టిపడేయకపోతే! ఇక్కడ పడేసేముందు బాగా కొట్టినట్లున్నారు. ఆ దెబ్బలకోసం ఎన్నడూ ఏడవలేదు. ముసలిదానిగురించే బాధంతా. పోయేరోజుకూడా ఎంత ఏడ్చాడు– వెళ్ళేసరికి అది బతికుంటుందో లేదోనని. ఏమయిందో ఆ ముసలిది? ఎట్లా బ్రతుకుతున్నారో వాళ్లు. వెళ్ళేసరికి ఆ ముసలిది చచ్చిపోయి వుంటే ఏమౌతాడు ఆ తాత. తనకు జరిగిన అన్యాయానికి లోకాన్నిశపిస్తాడేమో– హత్యలు చేస్తాడేమో– ఇంకెంత కఠినంగా మారుతుందో అతనిమనసు- లేకుంటే ఒక్కసారి బావురుమని ఏడ్చి నిశ్శబ్దంగా తన జీవితాన్ని గడిపేస్తాడేమో!

ఆతాత అట్లా వెళ్లాడోలేదో తన నిట్టూర్పు అణిగిందో లేదో– ఇద్దరు యువకుల్ని తాగి తూలుతున్నవారిని తీసుకొచ్చారు బండబూతులు తిట్టుకుంటూ; ఆ యిద్దరుకూడా ఏవో అస్పష్టంగా తిడుతూనే ఉన్నారు. రాత్రంతా వారిగోలను నిశ్శబ్దంగా భరించింది తను. తెల్లవారేసరికి ఎలా మారిపోయారు? రాత్రి నిర్లక్ష్యం ధైర్యం ఏమైపోయాయో

1173

దీనంగా మొగాలు వేలాడేసుకుని నిలుచున్నారు. ఒకడి చెల్లెలిపెళ్ళిట ఆ మరునాడు. ఎంతో కంగారుపడ్డాడు అతనులేకుంటే పెళ్ళిజరగదట. ఔను చూస్తూచూస్తూ జైలులో ఉన్నమనిషి చెల్లెలిని ఎవరు చేసుకుంటారు. మనుషుల జీవితాలకు కళంకం ఆపాదించే తన బతుకెంత హీనమైంది? నన్నుకట్టి నాద్వారా వాళ్ళ బతుకుల్ని రక్షించుకునేవారు ఎలాంటివారు? నేనులేకుండా నా అవసరం కలగకుండా మనుషులు జీవిస్తే ఎంత బాగుండు అప్పుడు నాలోనికి స్వేచ్ఛగా వెలుగు చల్లనిగాలీ వెన్నెలలు హాయి అన్నీ వస్తాయికదూ— ఓ మానవులారా ముందు నాకుజరిగే అన్యాయాన్ని ఆపండి. నా బతుకు నింత నీచం చేయకండి అని మొరపెట్టుకోవాలనిపిస్తుంది అప్పుడప్పుడూ ఆయువకుడు పాపం మొత్తుకున్నాడు వదిలిపెట్టమని. జీవితంలో ఎవరినీ లెక్కచేయనక్కరలేని వయసులో, ధైర్యంగా దర్జాగా బ్రతకాల్సిన యవ్వనంలో ఎట్లా దీనంగా బతిమాలు కున్నాడు కళ్ళన్నీ ఎర్రబడేలా ఏడ్చాడు. కాళ్ళమీద పడ్డాడు. కనికరం ఈ గోడల మధ్యకుకూడా రాదని అతనికెవరుచెబుతారు. చివరకు మళ్ళీతిట్లకు తలపడ్డాడు. 'వాళ్లు' వచ్చి బూటుకాళ్ళతో నాలుగుతన్నితే వెక్కివెక్కి ఏడ్చి సొమ్మసిల్లి పడిపోయాడు. ఏం చేసింది తను నిట్టూర్పటం తప్ప ఎందుక మరి రాత్రితాగాడు? ఎందుకు వ్యభిచారం చేసాడు? ఆ పరిస్థితులు ఎందుకు కొనితెచ్చుకున్నాడు. అతనే తెచ్చుకున్నాడా? ఈ మనుషుల సమాజం బాధ్యతేమీలేకుండా అతనొక్కడే ఎలా నేరం చేయగలిగాడు? సమాజపు బాధ్యతేమీలేదా? నేనెంత నిలదీసి అడిగినా నాగోడు ఎవరికి వినిపిస్తుంది. వాళ్ళగోడవలే వినిపించుకోని మనుషులు నన్ను పట్టించుకుంటారా? కొన్నాళ్లకు ఆ యిద్దరూ వెళ్లిపోయారు. ఇక అంతేముంది ఒకరుపోతే ఒకరు. అంతో యింతో తేడాగా అందరి బతుకులూ ఒకటే. దొంగతనం చేసి, ఒళ్లు తెలియకుండా తాగి వ్యభిచరించి హత్యలుచేసి— ఎందరో వచ్చారు. అందరినీ భరించింది. మానవ చరిత్ర ప్రారంభమై యిన్నివేల సంవత్సరాలు గడిచినా నాగరికత ఎంతదూరమో పయనించినా ఎందుకు వీళ్ళు నావద్దకే వస్తున్నారు. ఎందుకు నాలోమాత్రం యింతదుఃఖం అవమానం భారం. నాకీబరువు తప్పించని ఎంతగొప్ప నాగరికతైనా ఏం ప్రయోజనం.

తనవద్దకు వచ్చిన మొదటి హంతకుడు— ఎంత జాలిగొలుపుతూఉన్నాడు మనిషి. ఎలా హత్యచేసాడో! అంత క్రూరమైనపని ఎలాచేసాడా అనిపించింది అతని కళ్ళు చూస్తుంటే. ఈ గదిలోకిరాగానే నాలుగు దిక్కులూచూసి ఒక్కసారి బావురుమని యేడ్చాడు. నావద్దకు ఎవరుమాత్రం సంతోషంగావస్తారు అనుకుంది తను అజ్ఞానంగా. రాత్రి ఒకటే కలవరించాడు. వాడిదొర ఎవడో— వాడు చెయ్యమన్నాడట. నీకేం ఫరవాలేదు నేనున్నానన్నాడట. దొర ఉప్పుతిని దొర చెప్పినపని చెయ్యకపోతే ఎంత పాపం? అందుకే దొర చెప్పినదాన్ని చంపేశాడు దొర తప్పుకున్నాడు. వీడు దొరికి

1174

పోయాడు. దొరలు ఎప్పుడూ దొంగలూ హంతకులూ కారు. ఇన్నాళ్లయింది నన్ను కట్టి ఒక్క గొప్పవాడూ నావద్దకురాలేదు. వారందరూ పుణ్యమూర్తులు కాబోలు. ఎప్పుడూ నా వద్దకు పతితులు భ్రష్టులు దరిద్రులేవస్తారు. దరిద్రాన్ని లేకుండాచేస్తే అందరూ గొప్పవారైపోతే నాకెంతహాయి. ఈ ఏడుపులనుంచీ బాధలనుంచి విముక్తమైపోతే– ఆరోజు వస్తుందా ఎన్నడైనా? ఆ హంతకుడు ఎట్లాగో ఉండేవాడు. అన్నం తినేవాడుకాదు. ఆరోజు! ఉరితీసేరోజు– కాసేపు నవ్వాడు కాసేపు ఏడ్చాడు. జుట్టు పీక్కున్నాడు. కేకలుపెట్టాడు. చివరకు నిశ్శబ్దంగా వెళ్ళిపోయాడు. కంట్లో తడన్నా లేకుండా ఏమీ మాట్లాడకుండా నిర్లిప్తంగా నిర్వికారంగా గదినుండి నడిచివెళ్లిపోయాడు. తనగుండెనెవరో గట్టిగా పిండినట్లయింది. ఎందుకిట్లా అన్యాయాలు జరుగుతుంటాయి? నోరులేని నాకుతెలిసినంతకూడా తెలియదా వీళ్లెవరికీ. ఎందుకింత ఆవేశాలు ఆలోచనలు వీరికి. ఎవరినో చంపటం అన్యాయమంటూ మళ్లా వీడినెందుకు చంపుతారు. వీళ్ళు న్యాయాన్యాయాలకు అతీతులా? ఈ నేరానికి ఈశిక్ష అని రాసుకుకూర్చున్న వీరి నేరాలకు శిక్షలేమిటి? ఈ ఆవరణలో మాత్రం ఎన్ని అన్యాయాలు జరగటంలేదు? ఎందుకింత ఘోరంగా మారిపోతుంది మానవ సమాజం. తనుమాత్రం నిట్టూర్చటం తప్ప ఏం చెయ్యగలదు?

ఇట్లా ఎన్నోరోజులు గడచి పోయాయి. ఎన్నిబాధలో భరించింది తను. ఎందరి కన్నీళ్ళో తన ఒడిలో యింకిపోయాయి. ఎందరి కథలు గాథలు ఆవేదనలు అన్యాయాలు ఆవేశాలు– ఎన్నోచూసింది. కానీ ఒక అనుభవం మాత్రం మరచిపోలేనిది. ఆనాడు తను పులకించిపోయింది. ముందు అసలేమీ అర్థంకాలేదు. నలుగురు యువకుల్ని తెస్తున్నారువాళ్లు. తను నిట్టూర్చబోయి ఆగిపోయింది. చిత్రం! ఆ యువకులు ఏడవటంలేదు సరికదా కనీసం విచారంగాకూడా లేరు. కొందరిలా వెకిలిగా నవ్వుతూగానీ పిచ్చిగావాగుతూగానీ రావటంలేదు. ఉత్సాహంగా చురుకుగా వస్తున్నారు. పక్కనున్న 'వాళ్ళ'కంటే కూడా ఠీవిగా నడుస్తున్నారు. తన లోపలికివచ్చి హుషారుగా 'వాళ్ళను' వీడ్కొన్నారు. ఒకతను సన్నగా పాడటం మొదలుపెట్టాడు. తక్కినవారు గొంతుకలిపారు. 'మరోప్రపంచం మరోప్రపంచం మరోప్రపంచం పిలిచింది' తనకేమీ అంతుబట్టలేదు. ఏమిటా వీళ్ళప్రపంచం అనుకుంది. పదండి ముందుకు అంటూ తన దగ్గరకు ఎందుకువచ్చారా అనుకుంది. ఆ తరువాత తెలిసింది ఆపాట పాడినందుకే ఆ బాటలో నడవాలన్నందుకే వాళ్లనిక్కడ పడేశారని. కానీ వాళ్లచేతులకు సంకెళ్లు ఉన్నా మనసులకులేవు. ఈ అన్యాయాల గురించి అధర్మాల గురించి ఎప్పుడూ విమర్శిస్తుండేవాళ్లు. ఇవన్నీ మార్చాలనేవాళ్లు. ఈజైళ్ల అవసరంలేని మరో ప్రపంచం నిర్మించాలనేవాళ్లు. అబ్బ! వాళ్లమాటలు వింటుంటే తనకెంత సంతోషం కలిగేది.

1175

వాళ్లఊహలు ఆలోచనలు ఎంత గొప్పవి. తనపై వారికెంత అభిమానం. అంతకు ముందు తనవద్దకు వచ్చినవారు ఏదో పోగొట్టుకున్నట్టు అవమానంగా అధైర్యంగా కాలం గడిపేవారు. వీరతీరేవేరు. ఎన్నడూ విచారం వారి ఛాయలకురాలేదు. ఎందుకు మనకు భయం? ఎందుకు మనకుబాధ? మనమేం తప్పుచేశామని? అని ప్రశ్నించు కునేవారు– యితరులు వింతగాచూస్తే. దరిద్రం ఎంత భయంకరమైనదో తనలాగే వారికీతెలుసు. ఎప్పుడు దరిద్రులగురించే ఆలోచించేవారు తపనపడేవారు. తనలాంటి వారే– వాళ్ల తనలోవుంటే ఎంతబాగున్నా– వాళ్లుండవలసినచోటు యిదికాదనిపించేది. బయట గాలీ నీళ్లూ స్వేచ్ఛా జీవితం వారికి యింకెంత ఉత్సాహాన్నిస్తుందో అనిపించేది. తనకుతాను రెండుగా చీలిపోయి వారికి దారియివ్వాలనిపించేది. వెనుక ఎప్పుడో తన తలుపులు చీల్చి ఒకరికి దారియిచ్చిన జైలుగది కథ గుర్తుపచ్చేది. తనకూ ఆశక్తివుంటే ఎంతబాగుండును. ఈ యువకులను ఈ ఉత్సాహాలను, ఈనెత్తురు కాల్వలను బయటకు పంపేదాన్నికదా అనిపించేది. వారు ఎప్పుడూ ఆపలేని ఉత్సాహంతో పొంగిపోతూ ఉండేవారు. బయటవున్న మిత్రుల్ని తలపోసేవాళ్లు. తన ఎత్తైనగోడలు వారినేమాత్రం ఆపలేవనుకుంది. ఔను వాళ్లు యిదికూడా పాడేవారు. 'మాకు గోడలులేవు, గోడలను పగులగొట్టడమే మాపని'. ఎక్కడా వాళ్లహృదయాలలో త్యాగం తప్ప స్వార్థం కనిపించేది కాదు వాళ్లరక్తంలో శౌర్యంతప్ప మరొకటి ప్రవహించేదికాదు. ఏవో చదివి ఎంత ఆవేశంతో కదిలిపోయేవారు. ఒకనాడు ఉన్నట్టుండి ఒకతను నిశ్శబ్దంగా మారిపోయాడు. ఒకటే బాధపడుతున్నాడు. తనకడుపు అల్లాడిపోయింది. ఆ రోజంతా అన్నం ముట్టలేదు. అతని మిత్రుడిని చంపివేశారట 'వాళ్లు' మిగతా ముగ్గురూ ధైర్యం చెప్పారు. వారి ప్రయాణం ఒకరోజుతో ఒకరిద్దరితో పూర్తికాదన్నారు. "నేస్తం! పోరాటం మధ్యలో అంతులేని కన్నీళ్ళకు ఆస్కారం లేదుసుమా!" అని భుజంతట్టారు. నలుగురూకలిపి నవ్వుతూ పాడటం మొదలుపెట్టారు "కొంతమంది కుర్రవాళ్లు పుట్టుకతో వృద్ధులు" వీరుమాత్రం అలాంటివారు కాదు. పౌరుషం త్యాగం మూర్తీభవించినవారు. వీరు ముందుతరం దూతలు. పావన నవజీవన బృందావన నిర్మాతలు– అనుకున్నది తను. కొన్నాళ్ళకు 'వాళ్లు'వచ్చి ఏవో ప్రశ్నించారు. వీరుమాత్రం స్థిరంగా సమాధానాలిచ్చారు. కొన్నింటికి మాట్లాడలేదు. విపరీతంగా కొట్టారు. ఆ లేతలేత చేతులను పాలుగారే బుగ్గలను రక్తం చిమ్మేలాచేసారు. వారు నవ్వుతూనే ఉన్నారు. ఎక్కడిది వీరికింత ధైర్యం. ఎలావచ్చింది ఈఓర్పు అని ఆశ్చర్యపోయింది. 'వాళ్లు'కూడా అదే అడిగారు. నలుగురూ ఏకకంఠంతో సమాధానమిచ్చారు. "మా ఆశయం మా మార్గం" బిగ్గరగా పాడటం మొదలుపెట్టారు. "కమ్యూనిస్టులం మేము కష్టజీవులం" వారిని విపరీతంగా కొట్టారు. ఆరోజు అర్థరాత్రి ఇద్దరినిలేపి తీసుకువెళ్లారు. మరునాడు

1176

మిగిలినవాళ్లు చెప్పుకుంటుంటే విన్నది. వాళ్ళిద్దరినీ కాల్చివేసారట పోరాటంలో కాల్చి వేశారట. స్పృహ లేకుండా కొట్టి యింకావారు పోరాడారని కాల్పులు జరిపారని చెబితే ఎవరు నమ్ముతారు? కానీ నాకూ ఆ యిద్దరికీ తప్ప నిజం ఎవరికితెలుసు వాళ్ళిద్దరు పోయినా వీరు అధైర్యపడలేదు. "ఎరుపంటే కొందరికి భయం భయం పసిపిల్లలు వారికన్న నయం నయం" అని పాడుకుంటూనే ఉన్నారు. వాళ్లున్నన్నాళ్లూ తనకుబాధ లేదు. బరువులేదు. ఎంతోగర్వంగా అనుభూతి చెందింది. వారి పసిముఖాలలోకిచూస్తూ చెప్పలేని ఆనందం అనుభవించింది. ఎవరో పవిత్రమూర్తులు తనగర్భంలో ఉన్నట్లు అనుభూతిచెందింది. వారునవ్వితే నవ్వింది. దిగులుపడితే మౌనంగా నిట్టూర్చింది. వారు కబుర్లు చెప్పుకుంటే ఆసక్తిగా విన్నది జీవితమంటే ఆసక్తిపెంచుకుంది. తనకు మంచి రోజులు వస్తాయని ఆశపడింది.

కొంత కాలానికి వారిద్దరినీకూడా తీసుకుపోయారు వారు నవ్వుతూనే "పదండి ముందుకు పదండి తోసుకుపోదాం పోదాం పైపైకి" అనుకుంటూనే వెళ్లారు. తనకు మాత్రం పట్టలేని దుఃఖం వచ్చింది. ఎక్కడకు తీసుకుపోతారో ఆ త్యాగధనులను. ఎట్లా కాల్చివేస్తారో. ఆ వెచ్చటి రక్తంతో ఆ మండేగుండెల రక్తం తడిసిననేలతల్లి ఎలా విలపిస్తుందో ఆమెకు ఎంతకోపం వస్తుందో. మిలమిల మెరిసే వారికన్నులలోని గర్వం కాంతి ఎలా హరించుకుపోతాయో. ఎంతకీ తనమనసు కుదుటపడలేదు. వారిపసి ముఖాలు, వారుపాడే పాటలు అన్నీ పదేపదే తలపుకువస్తున్నాయి. ఎన్ని అన్యాయాలో చూచి ఎండబారిన తనమనసు ఆరోజు విపరీతంగా చలించిపోయింది. ఆ బిడ్డలు వారి మిత్రులు ఎక్కడున్నారో యిప్పుడు. వాళ్ల ప్రపంచం ఎప్పుడొస్తుందో. తనబాధలు ఎప్పుడు విముక్తమౌతాయి.

జైలుగది నిట్టూర్చింది. ఆవేడి ఊర్పులకు గదిగోడలు బీటలువారుతున్నాయి.

1177